సాక్షి
రంగారెడ్డి
మంగళవారం ׀ 4 ׀ ఏప్రిల్ ׀ 2023



న్యూస్‌రీల్

సూర్యప్రభావాహనంపై చిలుకూరు బాలాజీ



మొయినాబాద్: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు నాలుగోరోజు కొనసాగాయి. సోమవారం స్వామివారు సూర్యప్రభావాహనం, గరుడ వాహనసేవలు అందుకున్నారు. ఉదయం సూర్యప్రభావాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం గరుడవాహన సేవలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వేద పారాయణం, పూజలు, మంగళహారతి సేవలు నిర్వహించారు. రాత్రి 11 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. మంగళవారం స్వామివారిని గజవాహనంపై ఊరేగిస్తారని చెప్పారు. వేడుకల్లో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, నరసింహన్, మురళి, కన్నయ్య, కిట్టుస్వామి, సురేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ బోధనకు పార్ట్‌టైమ్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌శర్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తోల్‌కట్ట సమీపంలో ఉన్న ఈ కళాశాలలో దరఖాస్తు చేసుకునేవారు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు పొంది ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు విద్యార్హత జిరాక్స్ సర్టిఫికెట్ కాపీలను జత చేసి ఈ నెల 6వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్కానింగ్ టెస్ట్, డెమో ద్వారా నియామకం ఉంటుందని వివరించారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ తిరుపతిరావు తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చూపిన స్ఫూర్తిని కొనసాగించాలని అదనపు కలెక్టర్ తిరుపతిరావు అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య 96వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ముందుగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరాటం అనగానే మొదటగా గుర్తుకు వచ్చే యోధుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు. కొమురయ్య కనబర్చిన తెగువ, పోరాట పటిమను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, బీసీ సంక్షేమ అధికారి ఉదయ భాస్కర్, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'నార్మల్' పాల సేకరణ ధర పెంపు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని నార్ముల్ మదర్‌డెయిరీ రైతుల నుంచి పాలను సేకరించే ధరను పెంచుతున్నట్లు డెయిరీ చైర్మన్ శ్రీకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కిలో వెన్న శాతం ఉన్న గేదె పాలకు 756 నుంచి 856కు పెంచామని, కిలో ఘనపదార్థం ఉన్న ఆవు పాలకు 313 నుంచి 353కు పెంచినట్లు ఆయన తెలిపారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారికి ఆర్థిక ప్రయోజనం కలిగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రైతులు ప్రైవేటు డెయిరీల ఉచ్చులో పడి మోసపోకుండా నార్ముల్ డెయిరీకి పాలు పోయాలని ఆయన సూచించారు.



హయత్‌నగర్: పరీక్ష రాసేందుకు వెళ్తున్న దివ్యాంగ విద్యార్థులు



కేశంపేట: పరీక్ష రాసేందుకు ట్రాలీ ఆటోలో వెళ్తున్న పాటిగడ్డ కేజీబీవీ విద్యార్థినులు



హయత్‌నగర్: విజయ సంకేతం చూపుతున్న విద్యార్థినులు

'పది' షురూ

పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు నిర్దేశిత సమయానికి ముందే చేరుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు. విద్యార్థులతో పాటు పేరెంట్స్ పరీక్ష కేంద్రాల వద్దకు పెద్ద సంఖ్యలో రావడంతో సందడి వాతావరణం నెలకొంది. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు.



ఇబ్రహీంపట్నం: ప్రియాంక సెంటర్ వద్ద విద్యార్థులు, పేరెంట్స్ సందడి

అర్జీలపై నజర్!

ప్రజావాణి దరఖాస్తులపై కలెక్టర్ దృష్టి

- స్థితిగతులపై ఎప్పటికప్పుడు ఆరా
- సత్వర పరిష్కారానికి చర్యలు
- ఆయా శాఖల అధికారులకు మౌఖిక ఆదేశాలు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూ సంబంధిత సమస్యలతో పాటు ఇతర అంశాలపై అందిన అర్జీలపై కలెక్టర్ హరీశ్ దృష్టి సారించారు. ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' సహా బాధితులు స్వయంగా కలెక్టరేట్‌ను కలిసి అందజేసే అర్జీలు, ఇన్‌వార్డుల్లో అందిన వినతులకు పరిష్కారమార్గం లభించిందా.. పెండింగ్‌లో పెట్టారా.. కారణాలేంటి..? తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ఆరా తీయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. తాజాగా ప్రజావాణిలో మరో 70 దరఖాస్తులు అందాయి. అధికారులు వాటిని ఆయా శాఖలకు పంపారు. పదిహేను రోజుల్లోవాటికి పరిష్కార మార్గం చూపించాలని ఆదేశించారు.

బాధితులకు భరోసా ఇచ్చేందుకే..

భూ వివాదాల పరిష్కారం కోసం ప్రభుత్వం ధరణి సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చింది. సమస్యలు పరిష్కారం కాకపోగా..కొత్తగా అనేక వివాదాలు తెరపైకి వచ్చాయి. అధికారుల నిర్లక్ష్యంతో పట్టా భూములు అసైన్డ్ భూములుగా.. భూదాన్, వక్ఫ్ భూములు పట్టా భూములుగా నమోదయ్యాయి. వీటిని సవరించాల్సిందిగా కోరుతూ బాధితులు ప్రతి రోజు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్‌కు చేరుకుంటున్నారు. రైతులతో పాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఫించన్ల కోసం అనేక మంది వస్తుంటారు. భూముల కబ్జాలు, చెరువులు, కుంటల ఆక్రమణలు, పార్కు స్థలాల్లో అక్రమ నిర్మాణాలు, వంటి అంశాలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి సుమారు 100 నుంచి 120 దరఖాస్తులు అందుతున్నాయి. అదనపు కలెక్టర్ తిరుపతి రావు సహా డీఆర్ఓ హరిప్రియ, ఇతర అధికారులు బాధితుల నుంచి అర్జీలను స్వీకరించడంతో పాటు సలహాలు, సూచనలు ఇస్తుంటారు. స్వీకరించిన దరఖాస్తుల్లో చాలా వరకు పరిష్కారం కావడం లేదు. పెండింగ్‌లో ఉండటానికి కారణం కూడా తెలియడం లేదు. దీంతో ఆయా బాధితులు మళ్లీమళ్లీ వస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్‌పెట్టాలని కలెక్టర్ భావించారు. ఇకపై వచ్చిన ప్రతి దరఖాస్తును స్వయంగా మానిటరింగ్ చేసి, బాధితులకు భరోసా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.

పరిష్కారం కాలేదు

బడంగ్‌పేట్ రెవెన్యూ పరిధిలోని దావూద్‌ఖాన్‌గూడ సర్వే నంబర్ 2లో 40.16 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వం 1955లోనే సుమారు 300 మంది పేదలకు అసైన్డ్ చేసింది. అప్పటి నుంచి ఈ భూమే జీవనాధారంగా బతుకుతున్నాం. అభివృద్ధి పనుల పేరుతో అధికారులు ముందస్తుగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా 24 ఎకరాలు తీసుకున్నారు. ప్రస్తుతం మరో 16 ఎకరాలు ఇంకా మిగిలే ఉన్నాయి. పహాణీల్లో మా తాతలు, తండ్రుల పేర్లు కూడా ఉన్నా యి. స్థానిక కార్పొరేటర్లు విలువైన ఈ భూమిని ఆక్రమించారు. వీటిలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. వీటిని తొలగించాలి. ఆక్రమణదారుల చెరలో ఉన్న మా భూములను మళ్లీ మాకే ఇప్పించాలి. మాకు న్యాయం చేయాలని తహసీల్దార్ సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. ఆయా అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.

– దావూద్‌ఖాన్‌గూడవాసులు

అరకొర కనెక్టివిటీ..!

- మేడ్చల్ నుంచి సికింద్రాబాద్‌కే ఎంఎంటీఎస్
- హైటెక్ సిటీకి వెళ్లాలంటే సికింద్రాబాద్‌లో రైలు మారాల్సిందే
- నేరుగా కనెక్టివిటీ ఉంటే ప్రయాణికులకు ఎంతో ఊరట
- 8న ఈ రూట్‌లో ఎంఎంటీఎస్‌ను ప్రారంభించనున్న ప్రధాని

సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికులను ఎంతో ఊరించిన ఎంఎంటీఎస్ కొత్త రూట్ అరకొర కనెక్టివిటీతో ఉస్సూరుమనించే అవకాశం కనిపిస్తోంది. మేడ్చల్ నుంచి సికింద్రాబాద్ వరకే ఇది పరిమితం కానుంది. ఈ నెల 8న ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ రూట్‌లో ఎంఎంటీఎస్ రైళ్లను ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. అలాగే ఉందానగర్–ఫలక్‌నుమా మధ్య కూడా రైళ్లను ప్రారంభించనున్నారు. మేడ్చల్, మల్కాజిగిరి వాసులు హైటెక్‌సిటీ, లింగంపల్లి వైపు వెళ్లాలంటే సికింద్రాబాద్‌లో మరో రైలు మారాలి. ఇది కొంతవరకు ఇబ్బందిగానే ఉంటుంది. సాఫీగా వెళ్లేందుకు అవకాశం ఉండదు. మరో ట్రైన్ కోసం సికింద్రాబాద్‌లో పడిగాపులు కాయాల్సి ఉంటుంది. మేడ్చల్ నుంచి నేరుగా లింగంపల్లి వరకు నడిపేందుకు అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతం సికింద్రాబాద్ వరకే పరిమితం చేసినట్లు సమాచారం. ప్రతి రోజు లక్షలాది మంది ప్రయాణికులు మేడ్చల్, సుచిత్ర, కొంపల్లి, అల్వాల్, నేరేడ్‌మెట్, సైనిక్‌పురి, బొల్లారం, మల్కాజిగిరి తదితర ప్రాంతాల నుంచి హైటెక్ సిటీ వైపు రాకపోకలు సాగిస్తున్నారు. వారంతా సిటీ బస్సులు, సొంత వాహనాల్లో ప్రయాణం చేస్తున్నారు. మేడ్చల్ వాసులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఎంఎంటీఎస్ సర్వీస్ అందుబాటులోకి వచ్చినప్పటికీ అరకొర కనెక్టివిటీతో పాక్షిక సదుపాయంగానే మిగలనుందనే భావన కలుగుతోంది.

ఉందానగర్ నుంచి ఉన్నా..

- పాలు, కూరగాయలు తదితర వస్తువులను విక్రయించే చిరువ్యాపారులు ఉందానగర్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. మేడ్చల్, మల్కాజిగిరి వైపు రాకపోకలు సాగించేవారు ఉన్నారు. ఉందానగర్, ఫలక్‌నుమా నుంచి వచ్చేవారు. లేదా మేడ్చల్, మల్కాజిగిరి ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లేవారు సికింద్రాబాద్‌లో దిగి మరో రైలు మారాలి. ఈ రూట్‌లోనూ ఇది అరకొర సదుపాయం కానుంది.
- అలాగే ఉందానగర్ నుంచి నేరుగా లింగంపల్లి వరకు ఇప్పట్లో రైళ్లు అందుబాటులోకి రాకపోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఎంఎంటీఎస్ రెండో దశలో కొత్తగా రెండు రూట్‌లలో ఏకంగా ప్రధాని చేతుల మీదుగా రైళ్లను ప్రారంభించనున్నప్పటికీ వందశాతం కనెక్టివిటీలేకపోవడంతో ప్రయాణికులకు పెద్దగా ప్రయోజనం ఉండకపోగా, అలంకారప్రాయంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇలా అయితే ఎంతో మేలు..

- ఉత్తరం వైపు ఉన్న మేడ్చల్ నుంచి పడమటి వైపున ఉన్న లింగంపల్లి వరకు సుమారు 50 కిలోమీటర్ల వరకు రైళ్లను నడపడం వల్ల ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది.
- దక్షిణం వైపున ఉన్న ఉందానగర్ నుంచి నేరుగా లింగంపల్లికి రైళ్లను నడిపితే ఈ రూట్‌లో కనెక్టివిటీ పెరుగుతుంది. నగరంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలను పడమటి వైపు ఉన్నప్రాంతాలతో పూర్తిస్థాయిలో అనుసంధానం చేసినట్లవుతుంది.
- మేడ్చల్ నుంచి ఉందానగర్ వరకు నేరుగా రైళ్లను ఏర్పాటు చేస్తే ఉత్తర– దక్షిణ ప్రాంతాల మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది.



చార్మినార్‌కు రంజాన్ శోభ

రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని పాతబస్తీ కళకళలాడుతోంది. చార్మినార్ పరిసరాల్లోని దుకాణాలు కొనుగోలుదారులతో రాత్రిపూట కొత్తదనంతో ఉట్టిపడుతున్నాయి. ప్రత్యేక ప్రార్థనలతో మక్కా మసీదు ఆధ్యాత్మికతను సంతరించుకుంది.

మహనీయుల ఆశయసాధనకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న విమలక్క

కడ్తాల్: ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో నడవాలని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని అరుణోదయ సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు విమలక్క పిలుపునిచ్చారు. తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక–వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలతో పాటు, మహనీయుల జ్ఞాన దీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి విమలక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంతో పాటు, జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, వివేకానంద విగ్రహాలకు, దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్‌తో పాటు పలువురు యువకులు మహనీయుల జ్ఞాన దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. గ్రామాల్లో రాజకీయ బానిసత్వం పోవాలని, సమసమాజ స్థాపనకు యువత కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ చదువుకుని జ్ఞాన సముపార్జన చేయాలని, జ్ఞానంతోనే జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత నడుం బిగించాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ మాట్లాడుతూ.. జ్ఞాన దీక్ష 11 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం భారత రాజ్యాంగానికి సంబంధించిన పుస్తకాలను యువతకు అందజేశారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ అధ్యక్షుడు మాధవులు, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఉప సర్పంచ్ రామకృష్ణ, బీసీ నాయకుడు చందోజీ, నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌యాదవ్, అంబేడ్కర్ సంఘాల అధ్యక్షుడు సిద్దిగారి దాస్, బీసీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి రవి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎల్.రమణ

- బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా సమన్వయకర్త, ఎమ్మెల్సీ ఎల్.రమణ

శంకర్‌పల్లి: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతాని కృషి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా సమన్వయకర్త, ఎమ్మెల్సీ ఎల్.రమణ పిలుపునిచ్చారు. మోకిల గ్రామంలోని రవీందర్‌రెడ్డి గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఎదిగిందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. 75 ఏళ్ల పాలనలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి పనులను చేపట్టినట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచి పేదవాడి నడ్డి విరుస్తోందన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి జిల్లాలో తిరుగులేదన్నారు. నాయకులు సమన్వయంతో పని చేసి పార్టీ బలోపేతానికి నడుం బిగించాలని సూచించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, ఏఎంసీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కావలి గోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు ఖన్నా, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఫరీద్, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, మోకిల ఎంపీటీసీ సరిత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాయదుర్గం మెట్రో స్టేషన్‌కు మరో దారి

- లెమన్‌ట్రీ హోటల్ వైపు ఏర్పాటు
- మెట్ల మార్గంతోపాటు ఎస్కలేటర్ సౌకర్యం
- నేటి నుంచి అందుబాటులోకి
- ఐటీ ఉద్యోగులకు ఎంతో ఊరట



సాక్షి, సిటీబ్యూరో: రాయదుర్గం మెట్రో స్టేషన్‌కు మంగళవారం నుంచి మరో కొత్త దారి అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం ఈ స్టేషన్‌కు రాకపోకలు సాగించేందుకు మూడు వైపులా మార్గాలు ఉన్నాయి. కొత్తగా ఆర్మ్–బి వైపు 4వ మార్గాన్ని ప్రారంభించనున్నట్లు ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు తెలిపారు. మెట్ల మార్గంతో పాటు ఎస్కలేటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. లెమన్ హోటల్ వైపు ఈ కొత్త మార్గం అందుబాటులో ఉంటుంది. దీంతో ఇటు వైపు నుంచి మెట్రోస్టేషన్‌కు రాకపోకలు సాగించే వందలాది మందికి ఎంతో ఊరట లభించనుంది. ఐటీ ఉద్యోగులతో పాటు, వివిధ సంస్థల్లో పని చేసేవారు ఈ మార్గం నుంచి రాకపోకలు సాగించనున్నారు. ప్రస్తుతం ఉదయం, సాయంత్రం రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో ప్రయాణికులు ఇబ్బందిపడాల్సి వస్తోంది. లెమన్ ట్రీ హోటల్ వైపు మార్గం ఏర్పాటుతో ఇబ్బందులు పూర్తిగా తొలగిపోనున్నాయి. ప్రయాణికుల రాకపోకలు సాఫీగా సాగేందుకు అవకాశం ఉంటుంది. నగరంలోని అత్యధిక రద్దీ ఉండే మెట్రోస్టేషన్‌లలో ఒకటైన రాయదుర్గం నుంచి ప్రతి రోజు సుమారు 60 వేల మంది ప్రయాణం చేస్తారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ నాలుగో ద్వారాన్ని ప్రయాణికులకు అందుబాటులోకి తేవడం సంతోషంగా ఉందని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. మెట్రో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలతో పాటు భద్రతను అందజేసేందుకు ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపడుతుందని ఎల్ అండ్ టీఎంఆర్‌హెచ్‌ఎల్ ఎండీ కేవీబీ రెడ్డి చెప్పారు.

కంటి వెలుగుతో పేదలకు ప్రయోజనం

సర్పంచుల సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు శోభ



కంటి వెలుగు కార్యక్రమంలో మాట్లాడుతున్న శోభ తదితరులు

మొయినాబాద్ రూరల్: అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు డీ శోభ సూచించారు. సోమవారం మండలంలోని కేతిరెడ్డిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలో కంటి జబ్బులను గుర్తించి సకాలంలో చికిత్స తీసుకుంటే అంధత్వం నుంచి బయటపడవచ్చనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ సిద్ధయ్య, వార్డు సభ్యులు జంగారెడ్డి, లలితమ్మ, శారద, కుమార్, కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మ, చైతన్య, ఖయూమ్, వజ్రమ్మ, ఏఎన్‌ఎం జ్ఞానేశ్వరి, గంగా, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే ప్రతిపక్ష పార్టీల నేతలు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, వారి విమర్శలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని ముద్విన్ గ్రామంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం, నిర్మాణ దశలో ఉన్న పంచాయతీ భవనం, ముద్విన్ - ఆకుతోటపల్లి మార్గంలో కూలిన ఊర వాగు వంతెనను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 5న ముద్విన్ గ్రామంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ బలోపేతం, ప్రజా సంక్షేమం, వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా కష్టపడి పనిచేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకు అందుతున్నాయని, వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం వైపు దేశం మొత్తం చూస్తోందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సారథ్యంలో అందరం కలిసి ముందుకు సాగుదామన్నారు. పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా ఉంటూ ప్రతిపక్ష పార్టీల దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 5న గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం, రైతు వేదిక, సీసీ రోడ్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే రూ. 10లక్షలతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనానికి, రూ. 1.80 కోట్లతో ముద్విన్ - ఆకుతోటపల్లి రహదారిపై ఊర వాగుపై వంతెన నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు కే పరమేశ్, జెడ్పీటీసీ దశరథ్ నాయక్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచులు యాదయ్య, భారతమ్మ, నర్సింహగౌడ్, లోకేశ్, రైతు బంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, ఉప సర్పంచ్ వినోద్, పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

అభివృద్ధిలో మనమే నంబర్ వన్

తలకొండపల్లి: సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామని తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు కల్యాణలక్ష్మి పథకం చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై 61 మందికి చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి కేసీఆర్ పాలన శ్రీరామరక్ష అని, ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు మరో సారి కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీకోఆప్షన్ ఎండీ ముజిబర్ రహ్మాన్, సర్పంచులు లలిత, జ్యోతయ్య, రఘుపతి, రమేష్ యాదవ్, స్వప్నా, భాస్కర్‌రెడ్డి, హైమావతి, రమేష్, అలివేలు, విజయ్‌రెడ్డి, జగ్ని, రమేష్ నాయక్, జయమ్మ, వెంకటయ్య, ఆర్‌ఐ మంజుల, బాలకుమార్, యాదయ్య, కృష్ణయ్య, మార్కెట్ డైరెక్టర్ రమేష్‌నాయక్, రైతు సంఘం నాయకుడు రేణురెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కలప లారీ సీజ్



పోలీసులు సీజ్ చేసిన కలప లారీ

షాబాద్: అక్రమంగా కలప తరలిస్తున్న లారీని పోలీసులు సీజ్ చేశారు. షాబాద్ సీఐ గురువయ్య గౌడ్ తెలిపిన వివరాలు.. మండలంలోని ముద్దెంగూడ మార్గంలో సోమవారం సాయంత్రం షాబాద్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో కలప లోడుతో ఓ లారీ షాబాద్ వైపు వస్తుండగా తనిఖీ చేశారు. లారీలో 10 టన్నుల కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మంచాల మండలం ఎల్లమ్మ తండాకు చెందిన లచ్చు నాయక్ రైతుల వద్ద చెట్లు కొనుగోలు చేసి అనుమతులు లేకుండా కలపను తరలిస్తున్నారు. లారీని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోతాదుకు మించి రసాయనాలు

- బాటసింగారం మార్కెట్ తనిఖీల్లో వెలుగు
- నిబంధనలు పాటించకుంటే చర్యలు: ఫుడ్ కంట్రోల్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



మార్కెట్‌లో పండ్ల ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ కంట్రోలర్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం పండ్ల మార్కెట్‌లో రాష్ట్ర ఫుడ్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ శివలీల ఆధ్వర్యంలో సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా రసాయనాల ద్వారా పండ్లు పండిస్తున్నారని సాక్షి దినపత్రికలో 'మామిడి విషతుల్యం!' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన ఫుడ్ కంట్రోల్ అధికారులు మార్కెట్‌లోని మామిడి పండ్ల యార్డులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. యార్డులోని ప్రతీ మామిడి పండ్ల బాక్సులను క్షుణంగా పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. అధికారుల తనిఖీల్లో పలువురు ఏజెంట్లు నిబంధనలకు విరుద్ధంగా మోతాదుకు మించి రసాయనాలు వాడుతున్న పలువురిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మార్కెట్ ఆవరణలోని కార్యాలయంలో మార్కెట్ కార్యదర్శి చిలుక నర్సింహారెడ్డితో కలిసి కమీషన్ ఏజెంట్లకు, వ్యాపారులకు, ఎగుమతిదారులకు చట్ట ప్రకారం ఎలా రిఫైనింగ్ చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్ విజయ్‌కుమార్, ఫుడ్ కంట్రోలర్ అధికారులు లక్ష్మీనారాయణరెడ్డి, ఎంఏ ఖలీల్, ఉదయ్‌కిరణ్, ఈశ్వర్ రాథోడ్, హర్షిత, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యం వికటించి శిశువు మృతి



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బాలుడి బంధువులు

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- జాతీయ రహదారిపై రాస్తారాకో



బాలుడి మృతదేహం

షాద్‌నగర్ రూరల్: వైద్యం వికటించి నాలుగు నెలల బాలుడు మృతి చెందిన ఘటన షాద్‌నగర్ పట్టణంలోని స్టార్ కిడ్జ్ ఆస్పత్రిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాంనగర్ కాలనీకి చెందిన నరేందర్, కీర్తన దంపతులకు నాలుగు నెలల బాలుడు ఉన్నాడు. రెండు రోజులుగా బాలుడు దగ్గు, జ్వరం, జలుబుతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం తల్లిదండ్రులు సోమవారం పట్టణంలోని స్టార్ కిడ్జ్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల చికిత్స అనంతరం బాలుడి మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యం వికటించడం వల్లే బాలుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న బంధువులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి ఎదుట, పాత జాతీయ రహదారిపై బైఠాయించి రెండు గంటల పాటు రాస్తారోకో చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు.

హరితహారం మొక్కలు సిద్ధం చేయండి

డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్

షాద్‌నగర్ రూరల్: హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్ సిబ్బందికి సూచించారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ గ్రామీణ నర్సరీ, క్రీడా ప్రాంగణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో నాటేందుకు అవసరమైన మొక్కలను నర్సరీల్లో సిద్ధంగా ఉంచాలన్నారు. అలాగే క్రీడా ప్రాంగణాలను అన్ని విధాలా అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా మైదానాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఉపాధి కూలి డబ్బులను ప్రభుత్వం పెంచిందన్నారు. కూలీల సంఖ్యను పెంచి వారికి పని దినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్య, ఏపీఓ అరుణ, కార్యదర్శి శ్వేత, టెక్నికల్ అసిస్టెంట్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణ పన్ను పేరిట బురిడీ

- రూ. 6వేలు ఫోన్ పే చేయించుకున్న అపరిచిత వ్యక్తి
- పోలీసులకు ఫిర్యాదు

కొత్తూరు: మున్సిపల్ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీ దుకాణానికి సంబంధించిన పన్ను చెల్లించాలంటూ ఓ అపరిచిత వ్యక్తి వ్యాపారి నుంచి నగదును ట్రాన్స్‌ఫర్ చేయించుకొని మోసం చేశాడు. ఈ ఘటన కొత్తూరు పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. తిమ్మాపూర్ 3వ వార్డుకు చెందిన హనుమాన్ చేగూరు రోడ్డులో హార్డ్ వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం ఓ వ్యక్తి కొత్తూరు మున్సిపల్ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పి.. మీ దుకాణానికి సంబంధించి లేబర్ ట్యాక్స్ రూ. 6వేలు చెల్లించాలని కోరాడు. ఫోన్ పే చేయాలని కోరాడు. దీంతో హనుమాన్ రూ. 6 వేలు ఫోన్ పే చేశాడు. కొంత సేపటి తర్వాత అనుమానం వచ్చిన బాధితుడు మళ్లీ అదే ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. మోసపోయానని తెలుసుకున్న బాధితుడు మున్సిపల్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డీసీఎంను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



కొత్తూరు: డీసీఎం వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తిమ్మాపూర్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శంకర్ వివరాల మేరకు.. హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జడ్చర్ల నుంచి నగరానికి వస్తుండగా చేగూరు కూడలి వద్ద ముందు వెళ్తున్న కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో హైదరాబాద్ నుంచి కొత్తూరు వైపు వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పోలీసులు చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మార్కెట్‌లో వ్యక్తి హత్య

మద్యం మత్తులో సహచరుడే ఘాతుకానికి పాల్పడినట్లు గుర్తింపు

సనత్‌నగర్: భరత్‌నగర్ కూరగాయల మార్కెట్లో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సహచరుడే మద్యం మత్తులో అతన్ని సెంట్రింగ్ కర్రతో దాడి చేసి హతమార్చాడు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. శ్రీకాకుళంకు చెందిన శ్యాంసుందర్‌రావు (56) కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్యా ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదే జిల్లాకే చెందిన రామారావు (70) మూసాపేట జనతానగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈయనకు నలుగురు పిల్లలు ఉన్నారు. వీరిద్దరు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ భరత్‌నగర్ ప్రాంతంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లపై నివాసం ఉంటున్నారు. రామారావు గత కొంత కాలం స్థానికంగా ఉండే ఓ పూజా స్టోర్‌లో పనిచేసి మానేశాడు. ఇటీవలే అతనికి పరిచయమైన శ్యాంసుందర్‌రావు మద్యం సేవించి తరచూ రామారావును వేధిస్తూ ఇబ్బంది కలిగిస్తుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి శ్యాంసుందర్‌రావు మద్యం సేవించి రామారావును దుర్భాషలాడడంతో కోపోద్రిక్తుడైన రామారావు అక్కడే ఉన్న సెంట్రింగ్ కర్రతో శ్యాంసుందర్‌రావు తల, ముఖంపై విచక్షణారహితంగా కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన శ్యాంసుందర్‌రావు అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికులు, సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ చేపట్టారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని రామారావును అదుపులోకి తీసుకున్నారు.

రెండో రోజూ దొరకని వ్యక్తి ఆచూకీ



క్వారీలో కొనసాగుతున్న గాలింపు చర్యలు

ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్ కలెక్టర్ భవనం వెనకాల ఉన్న బొరబండ క్వారీలో ఆదివారం స్నేహితులతో కలిసి ఈత కోసం వచ్చిన యువకుడు క్వారీ గుంతలో గల్లంతైన విషయం తెలిసిందే. ఆరు మందిలో ఐదుగురు మాత్రమే బయటపడగా ఉప్పుగూడకు చెందిన కిరణ్‌కుమార్(19) ఆచూకీ సోమవారం కూడా లభించలేదు. ఆదిబట్ల పోలీసులు, రెస్క్యూ బృందాలు రెండు రోజులుగా గాలిస్తున్నారు. బోట్లు, గజ ఈతగాళ్ల సహాయంతో వెతికినా ఎలాంటి ఆనావాళ్లు లభించలేదు. లోతైన క్వారీ, పదునైన బండలు ఉండటంతో మృతదేహం ఎక్కడైన ఇరుక్కుపోయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. సోమవారం రాత్రి వరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు. క్వారీ వద్ద తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మంగళవారం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టనున్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే పేపర్ లీకేజీ



సుమన్ గౌడ్

పహాడీషరీఫ్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగానే పదో తరగతి పరీక్షలు జరుగుతుండగానే సోషల్ మీడియాలో ప్రశ్నపత్రం లీకేజీ అయ్యిందని వైఎస్సార్ టీపీ రాష్ట్ర యూత్ కో-ఆర్డినేటర్ జీ సుమన్ గౌడ్ ఆరోపించారు. సోమవారం ఆయన మామిడిపల్లిలో మాట్లాడారు. పరీక్ష హాల్‌లోకి నిబంధనలకు విరుద్ధంగా ఇన్విజిలేటర్ సెల్‌ఫోన్‌ను ఎలా వినియోగిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనతో వేలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డ పరిస్థితులు ఉన్నాయన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే ఇలాంటి ఘటనలపై మరింత కఠినంగా వ్యవహరించాలన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఒకరికి గాయాలు

ఆమనగల్లు: ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడ్తాల మండలం మర్రిపల్లి గ్రామానికి చెందిన అనంతరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. మర్రిపల్లికి చెందిన అనంతరెడ్డి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం ఆమనగల్లు పట్టణంలోని విద్యుత్ కార్యాలయానికి వచ్చాడు. అనంతరం బైక్‌పై మర్రిపల్లి వెళ్లడానికి జాతీయ రహదారిని దాటుతున్న సమయంలో వెనుకనుంచి వచ్చిన కారు ఢీకొనడంతో అనంతరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

హుక్కా సెంటర్‌పై దాడి

రాజేంద్రనగర్: హుక్కా సెంటర్‌పై రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి 15 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పి.వి.నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నం.207 ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఓ యువకుడు ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. అనంతరం తన స్నేహితులతో కలిసి ప్రతి రోజు ఇంట్లోనే హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈ సెంటర్‌కు ఎలాంటి అనుమతులు లేవు. పోలీసులు, స్థానికులకు ఎవరికి తెలియకుండా పేరు సైతం లేకుండా ఈ సెంటర్‌ను కొనసాగిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేసి 15 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి రోజు మద్యం తాగొద్దన్నందుకు..

బంజారాహిల్స్: పెళ్లి రోజు నాడు మద్యం తాగొద్దని, బయటికి వెళ్దామని భార్య చెప్పగా ఇందుకు అంగీకరించకుండా భార్యపై అలిగి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జూబ్లీహిల్స్ రోడ్ నెం.51 జర్నలిస్టు కాలనీలో నివసించే కె. రాము(44), సంధ్య దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. గత నెల 31వ తేదీన వీరి పెళ్లిరోజు కాగా ఉదయం ఆలయానికి వెళ్ళి వచ్చిన తర్వాత మద్యం తాగేందుకు డబ్బులు కావాలని భార్య సంధ్యను అడిగాడు. అయితే ఈ రోజు మద్యం తాగవద్దని, సాయంత్రం బయటికి వెళ్దామని భార్య చెప్పడంతో కోపంతో బయటికి వెళ్లిన రాము గడ్డిమందు తీసుకొని ఇంటికి వచ్చి తాగాడు. కొద్దిసేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వెంటనే ఆస్పత్రిలో చేర్పగా ఈ నెల 1వ తేదీన చికిత్స పొందుతూ నిమ్స్‌లో కన్నుమూశాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.